ప్రజాశక్తి
మంగళవారం 12 ఆగస్టు 2025 5 శ్రీ సత్యసాయి

గతంలో ఇచ్చిన అర్జీల నకళ్లను మెడలో వేసుకుని నిరసన తెలుపుతున్న బాధితుడు ఆంజనేయులు

284 సార్లు అర్జీలు ఇచ్చినా ఫలితం సున్నా..

గతంలో ఇచ్చిన అర్జీల నకళ్లతో బాధితుడు నిరసన

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

తన భూమి తనకు ఇప్పించండని ఓ రైతు కలెక్టరేట్లో 284 సార్లు అర్జీలు ఇచ్చాడు. ఫలితం లేకపోవడంతో గతంలో ఇచ్చిన అర్జీల నకళ్ల ను మెడలో వేసుకొని కలెక్టరేట్లో వినూత్న నిరసన తెలిపాడు. ఆ రైతు సోమవారం కలెక్టర్ లో జరిగే సమస్యల పరిష్కార వేదికకు వచ్చాడు. ఈసందర్భంగా ఆయన చెప్పిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కదిరి పట్టణానికి చెందిన ఆంజనేయులు నల్లమాడ మండలం పూలగంపల్లి గ్రామ పొలం సర్వేనెంబర్ 382-3, 383లో 2019లో 4.74 ఎకరాలను జక్కల వెంకటరావు అనే వ్యక్తి నుంచి కొనుగోలు చేశాడు. అయితే ఆయనకు వన్ బి వచ్చే లోపే ఆ భూమి డబుల్ రిజిస్ట్రేషన్ జరిగింది. ఆ భూమికి వెంకటరమణ అనే వ్యక్తి కౌలు పత్రం సృష్టించి రెవిన్యూ అధికారులతో మిలాఖత్ అయి తన పేరిట ఆన్ లైన్ లో రికార్డులు ఎక్కించుకున్నాడు. ఆ భూమిపై సర్వహక్కులు కలిగిన పత్రాలు ఉన్నప్పటికీ ఆక్రమణదారుడైన వెంకటరమణ తనను ముప్పుతిప్పలు పెడుతున్నాడని బాధిత రైతు ఆంజనేయులు వాపోయారు. ఈవిషయంపై తనకు న్యాయం చేయాలని పలుమార్లు తహశీల్దార్, ఆర్డీవో, కలెక్టరేట్లో కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ కు మొరపెట్టుకున్న నేటికీ ఫలితం కనిపించలేదని వాపోయాడు. తన దగ్గర ఉన్న పత్రాలను పరిశీలించి 285వ అర్జీకైనా చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరుతున్నానన్నారు.

నేడు కదిరిలో సిపిఎం జిల్లా మహాసభలు

జిల్లా మహాసభలు జరిగే ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

- హాజరుకానున్న రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్
- మహాసభకు ఏర్పాట్లు పూర్తి
- ఎర్రజెండాలతో కదిరి ముస్తాబు
- కామ్రేడ్ బడా సుబ్బిరెడ్డి, పోలా రామాంజనేయులు ప్రాంగణంలో ప్రతినిధుల సభ

ప్రజాశక్తి-కదిరి టౌన్

శ్రీసత్యసాయి జిల్లా సిపిఎం 14వ జిల్లా మహాసభలు మంగళవారం జరగనున్నాయి. కదిరి పట్టణ కేంద్రంగా మహాసభలు జరగనున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు హాజరుకానున్నారు. ఈయనతో పాటు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్‌తో పాటు జిల్లా నాయకులు, ప్రతినిధులు పాల్గొంటారు. ఉదయం 10 గంటలకు కదిరి పట్టణంలోని ఎన్జీవో హోంలో మహాసభలు నిర్వహించేందుకు ఇప్పటికే ఆ పార్టీ నాయకత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. మహాసభల ప్రాంగణానికి కామ్రేడ్ బడా సుబ్బిరెడ్డి, పోలా రామాంజనేయులు ప్రాంగణంగా నామకరణం చేశారు. గత మహాసభ నుంచి ఇప్పటి వరకు సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన ఉద్యమాలు, పోరాటాలు సమీక్షించుకుని భవిష్యత్ కార్యచరణను రూపొందించనున్నారు. గత పోరాటాలను సమీక్షించుకుంటూనే రాబోయే రోజుల్లో ప్రజా పునాదిని పెంపొందించుకోవడంపై మహాసభ ద్వారా దృష్టి సారించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు జిఎల్.నరసింహులు తెలియజేశారు. మహాసభల నేపథ్యంలో కదిరి పట్టణం అంతా సిపిఎం జెండాలు, తోరణాలతో అలంకరించారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి మహాసభకు హాజరయ్యే ప్రతినిధులకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేశారు. మహాసభల్లో జిల్లా అభివృద్ధి, వ్యవసాయం, కార్మిక రంగం, హంద్రీనీవా, నీటి జలాలు, స్థానిక యువతకు ఉపాధి, కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు తదితర వాటిపై తీర్మానాలు ప్రవేశపెట్టనున్నారు.

ప్రజల పక్షాన సిపిఎం..

- సమస్యల పరిష్కారమే అజెండాగా పోరాటాలు
- ఇళ్ల స్థలాలు, సాగుభూముల కోసం ఉద్యమం
- భూ నిర్వాసితులకు అండగా ..
- కోవిడ్ సమయంలో ఐసోలేషన్ కేంద్రాలు
- సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సమరశీల పోరాటాలు

పేదలకు ఇళ్లస్థలాల కోసం కలెక్టరేట్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా (ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి-కదిరి టౌన్

పేదల సమస్య ఏదైనా సిపిఎం ఎర్ర జెండా తోడుగా నిలుస్తోంది. రైతులు, కార్మికులు, కూలీలు, మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులు ఇలా అందరి సమస్యలను తమ సమస్యలుగా భావించి వాటి పరిష్కారం కోసం ఉద్యమ నినాదంతో ముందుకు సాగింది. పుట్టపర్తిగా కేంద్రంగా ఏర్పాటైన శ్రీసత్యసాయి జిల్లాలో సిపిఎం అనేక పోరాటాలు సాగించి ప్రజల పక్షాన నిలిచింది. ఆయా ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో నెలకొన్న సమస్యలపై ఎప్పటికప్పుడు ఉద్యమాలను నిర్వహించడమే కాకుండా ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించేలా చొరవ తీసుకున్నారు.

నంబులపూలకుంట మండలం సోలార్ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో భూములు కోల్పోతున్న నిర్వాసిత రైతుల పక్షాన సిపిఎం అలుపెరగని పోరాటం చేసింది. అర్హులైన రైతులకు పరిహారం చెల్లించాలని కోరుతూ చేపట్టిన పలు ఆందోళనల్లో జాతీయ, రాష్ట్ర నాయకులు పాల్గొని రైతులకు మద్దతుగా నిలిచారు. ఈ సమయంలో జరిగిన ఆందోళనల్లో పలువురు సిపిఎం నాయకులపై కేసులు నమోదు కాగా జైలుకు కూడా వెళ్లారు. అయినా పోరాటాన్ని ఆపకుండా సిపిఎం ముందుకు నడిచింది. ఇందులో భాగంగానే అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వంతో మాట్లాడి అర్హులైన రైతులకు పరిహారం అందించేలా చొరవ తీసుకున్నారు. పెనుగొండ వద్ద ఏర్పాటు చేసిన అంతర్జాతీయ కియా కార్ల పరిశ్రమకు భూములిచ్చిన రైతుల పక్షాన సిపిఎం పోరాటం చేసింది. పరిశ్రమల్లో స్థానిక యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పెనుగొండ మండలం పాలసముద్రం, కావేరి నాగేపల్లి, చిన్న బాబయ్యపల్లి వద్ద నాసన్, బెల్ పరిశ్రమల ఏర్పాటు సమయంలోనూ నిర్వాసితులకు మెరుగైన పరిహారం కోసం పోరాటాలు, ఆందోళనలు కొనసాగాయి. ఆర్అండ్ఆర్ ప్యాకేజీ వర్తింపజేసేలా రైతుల పక్షాన సుదీర్ఘ పోరాటం కొనసాగింది. కనగానపల్లి వద్ద సోలార్ ప్రాజెక్ట్ కోసం భూములు కోల్పోయిన రైతులకు మెరుగైన పరిహారం కోసం ఉద్యమం కొనసాగింది. పరిగి మండలంలో నిజాం షుగర్ ఫ్యాక్టరీ కోసం రైతుల పక్షాన ఆందోళనలు చేపట్టారు. ఇళ్లు లేని పేదలకు ఇంటి స్థలం తోపాటు ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ హిందూపురం, పెనుగొండ, సోమందేపల్లిలో తదితర ప్రాంతాల్లో భూస్వాధీన ఉద్యమాలు చేపట్టారు. భూగర్భ జలాలకు నష్టం కలిగించి రైతులకు ఉపయోగం లేని హంద్రీనీవా లైనింగ్ పనులను ఆపాలని కోరుతూ జిల్లా వ్యాప్తంగా సిపిఎం ఆందోళనలు చేపట్టింది. అధికారులు, మంత్రులు, ఎమ్మెల్యేలను కలిసి వినతిపత్రాలను అందజేసింది.

కోవిడ్ సమయంలో సేవలు

ప్రజా ఉద్యోమాలను నిర్వహించడమే కాకుండా సేవా కార్యక్రమాల్లో సైతం సిపిఎం ముందుండి తన బాధ్యతను చాటుకుంది. కరోనా విపత్కర సమయంలో కదిరి ప్రాంతం ఐసోలేషన్ కేంద్రాన్ని సిపిఎం నిర్వహించింది. వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో యోగి వేమన ఐసోలేషన్ సెంటర్‌ను దాదాపు 32 రోజుల పాటు నిర్విరామంగా కొనసాగించారు. కోవిడ్ రోగులకు ఆశ్రయంతో పాటు వైద్య చికిత్సలు, భోజన వసతిని కల్పించారు. డాక్టర్ మదన కుమార్ నేతృత్వంలో ముగ్గురు వైద్యులు వైద్య చికిత్సలు అందించారు. పేదల సమస్యలపై పోరాటం, సమాజ హితం కోరుతూ భవిష్యత్తులోనూ సిపిఎం తన కార్యచరణను రూపొందించుకుని ముందుకు సాగనుంది.

జాతీయ స్థాయి పోటీల్లో 'పురం' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-హిందూపురం

7 వ జాతీయ స్థాయి ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ 2025 జపాన్ కరాటే షోటోకాన్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం గౌరిబిదనూర్ కరాటే చాంపియన్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో హిందూపురం రూరల్ మండలం కిరికిరలో ఉన్న ఎల్ ఆర్ జి విద్యాలయ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. షాఫీ ఉద్దీన్ బంగారు పతకం, చైత, కష్మితరాయి, జనవిలు రజత పతకాలు, జోష్న, శ్రీదేవి, వనిత, రుచిత, హర్ష వర్ధన్ లు కాంస్య పతకాలు సాధించినట్లు కరాటే మాస్టర్ రఫీక్ తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు కరాటే మాస్టర్ రఫీర్‌తో పాటు పాఠశాల ఎఓ సంజీవ రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ ప్రసాద్, హెచ్‌ఎం సుధ, కోచ్‌లు రియాజ్ బాషా, జనార్ధన్ రెడ్డి, ప్రవీణ్ కుమార్, సాదిక్ బాషా అభినందించారు. అదే విధంగా హిందూపురం రూరల్ మండలం కిరికెర వద్ద ఉన్నా ఎల్ఆర్‌జి పబ్లిక్ స్కూల్ విద్యార్థులు కరాటేలో ప్రతిభ చాటారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను సోమవారం ప్రిన్సిపల్ భారతీ పాఠశాలలో అభినందించారు. ఈ పోటీలలో తమ పాఠశాల తరపున 29 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో కటా ఈవెంట్ లో మొదటి స్థానంలో 5, రెండవ స్థానంలో 6, మూడవ స్థానంలో 8 పతకాలు సాధించారు, కుమితే ఈవెంట్ లో మొదటి స్థానంలో 5, రెండవ స్థానంలో 6, మూడవ స్థానంలో 5 పతకాలు సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్ ఎస్ రియాజ్ భాష, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

డెంటల్ ల్యాబ్ టెక్నీషియన్‌ను నియమించాలి

ప్రజాశక్తి-హిందూపురం

జిల్లాస్థాయి హోదా కలిగిన హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో డెంటల్ ల్యాబ్ టెక్నీషియన్ ను వెంటనే నియమించాలని ఆర్.వై.ఎఫ్ నాయకులతో పాటు ప్రజాసంఘాల నాయకులు కోరారు. సోమవారం స్థానిక రెవిన్యూ కార్యాలయంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో డిప్యూటీ తాసిల్దార్ మైనద్దీన్ కు వినతిపత్రం అందజేశారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోకపోతే సమస్య పరిష్కారం అయ్యేంతవరకు పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఎస్.పి జిల్లా కార్యదర్శి ఏ.శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి ఎంఐఎం మున్నా, ఆల్ ఇండియా బీఎస్పీ జిల్లా అధ్యక్షులు హరికృష్ణ, శివశంకర్, ఓబులేసు, ఆర్.వై.ఎఫ్ నాయకులు నరసింహులు, మైలారప్ప, మలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్జీదారులకు పరిష్కారం చూపాలి

కలెక్టర్ టిఎస్. చేతన్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

తమ సమస్యలు పరిష్కారమవుతాయని ఎంతో ఆశతో అర్జీదారులు కలెక్టరేట్‌కు వస్తారని ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా అర్జీ దారులకు నాణ్యమైన పరిష్కారం చూపాలని కలెక్టర్ టిఎస్ చేతన్ ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికికలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామసుబ్బయ్య, డిపిఒ సమత హాజరై ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి అర్జీ దారుడు సంతృప్తి చెందే విధంగా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకూడదని ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో వెళ్లి పరిశీలించి అర్జీదారులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ప్రధానంగా భూ సమస్యలు, రేషన్ కార్డులు, ఇళ్లపట్టాలు, పింఛను మంజూరు తదితర అంశాలతో కూడిన వినతులు 226 అర్జీలు వచ్చాయని ఈ సమస్యలు అన్ని మన పరిధిలోనే పరిష్కరించవచ్చని చెప్పారు.

పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టర్, తదితరులు

అనాథ పిల్లల సంరక్షణ బాధ్యత తీసుకోవాలి

మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖలోని అంతర్భాగమైన జిల్లా బాలల పరిరక్షణ ద్వారా తల్లిదండ్రులు లేని పిల్లలను సంరక్షించాలని కలెక్టర్ టిఎస్ చేతన్ పిలుపునిచ్చారు. శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలల పరిరక్షణ ద్వారా అందుతున్న సేవలపై పోస్టల్ కేర్ తాత్కాలిక సంరక్షణ సంబంధించి గోడ పత్రికలను అధికారులతో కలిసి కలెక్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తల్లితండ్రులు లేని 6 సంవత్సరాల పైబడిన 18 సంవత్సరాల లోపు ఉన్న పిల్లలను 2 సంవత్సరాల పాటు పెంచి ప్రేమానురాగాలు పంచి తదుపరి శాశ్వతంగా దత్తత పొందే అవకాశం పోస్టల్ కేర్ ద్వారా కలుగుతుందన్నారు. అధికారులు తల్లిదండ్రులు సంరక్షణ లేని పిల్లలకు తాత్కాలికంగా సంరక్షించి వారికి ఎవరూ దిక్కులేరనే భావన కలగకుండా అన్ని చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఐసిడిఎస్ పీడీ ప్రమీల, మిషన్ కోఆర్డినేటర్ గీతాబాయి, డిసిపిఒ మహేష్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రూ.350 కోట్లతో 'పురం' అభివృద్ధి

ప్రజాశక్తి-హిందూపురం

స్థానిక ఎమ్మెల్యే బాలకృష్ణ చొరవతో తీసుకువచ్చిన రూ. 350 కోట్లతో హిందూపురం నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు మున్సిపల్ ఛైర్మన్ డిఇ రమేష్‌కుమార్, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి వీరయ్య తెలిపారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అభివృద్ధి పనులకు సంబందించిన పరిపాలన అనుమతి ఉత్తర్వులు ప్రదర్శించారు. హిందూపురం నియోజకవర్గంలో పట్టణంతో పాటు మూడు మండలాలను కలుపుతు రోడ్డు భవనాల శాఖ నుంచి రూ.45 కోట్లు మంజూరయ్యాయన్నారు. దీంతో పాటు మరో రూ.35కోట్లు అభివృద్ధి పనులకు నివేదికలను ప్రభుత్వానికి పంపినట్లు చెప్పారు. ఇప్పటికే హిందూపురం పురపాలక సంఘంలో రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం కోసం రూ.92.50 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. వీటితో పాటు ఆహుడా నుంచి రూ. 15 కోట్లు కూడా పరిపాలన అనుమతి పొందిందన్నారు. అలాగే అమృత్ పథకం ద్వారా రూ. 108 కోట్లతో సివేజ్ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ కూడా ఏర్పాటు చేయబోతున్నట్లు వారు వివరించారు. పట్టణంలో నీటి సరఫరా మెరుగు పర్చడం, నూతన పైప్ లైన్ నిర్మాణాల కోసం మరో రూ.136 అవసరం ఉన్నట్లు నివేదికలను పంపామనిఈ నిధులు సైతం మరో 3 నెలల్లో మంజూరు అవుతాయని అన్నారు. వీటితో పాటు కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు తీసుకు రావాడానికి బాలకృష్ణ ఇటీవల కేంద్ర మంత్రులను కూడా కలిశారన్నారు. తేధికారంలోకి వచ్చిన సంవత్సరంలోనే ప్రజలకు సంక్షేమ పథకాలను అందించడంతో పాటు అభివృద్ధిలో సైతం దూసుకు పోతున్నట్లు వివరించారు.

ఉమ్మడి జిల్లాలో తగ్గని వానలు

మద్దిలేరు వాగుపై కొట్టుకుపోయిన వంతెన
ధర్మవరంలో నీటిలో పడి వ్యక్తి మృతి
నిండిన చెరువులు, మునిగిన పంటపొలాలు

ప్రజాశక్తి- యంత్రాంగం

ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఆదివారం రాత్రి, సోమవారం ఉదయం వర్షం కొనసాగింది. వర్షాలు కొనసాగాయి. పలు మండలాల్లో ఆదివారం రాత్రి సోమవారం మధ్యాహ్నం వరకు వర్షం పడింది. సత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలోని శ్రీదేవి టాకీస్ వద్ద అధిక వర్షంతో మురుగుకాలువలు వర్షం నీటితో పొంగిపొర్లాయి. ఈ సమయంలో ఆదివారం రాత్రి అటుగా వెళ్లిన చేనేత కార్మికుడు నాగరాజు(60) అందులో ప్రమాదవశాత్తు పడి మరణించాడు. సత్యసాయి జిల్లా రొద్దం మండల పరిధిలోని రొద్దకంపల్లిలో రైతు రామాంజికి చెందిన మొక్కజొన్న పంటలోకి నీరు చేరింది. అనంతపురం జిల్లా పుట్లూరు మండలం గాండ్లపాడు గ్రామంలో పుల్లారెడ్డికి చెందిన ఇంటి వర్షం ధాటికి నేలకూలింది. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షానికి పుట్టపర్తి మండలం గాజులకుంట గ్రామ చెరువు నీటితో పూర్తిగా నిండింది. నాలుగు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఉమ్మడి జిల్లా అధికారులు తెలియజేశారు.

కొట్టుకుపోయిన మద్దిలేరు వాగు వంక

నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షానికి జిల్లాలోని పలు కాలువలు నీటితో ప్రవహిస్తున్నాయి. ఇందులో భాగంగా శ్రీసత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండలంలోని మద్దిలేరు వాగుకు వరద ఉధృతి అధికం అయ్యింది. గత నాలుగు రోజులుగా వాగు నీటితో ఉధృతంగా ప్రవహిస్తోంది. ఆదివారం రాత్రి ప్రవాహం అధికం కావడంతో మద్దిలేరు వాగుపై గంగిరెడ్డిపల్లి-కొడవండ్లపల్లి గ్రామాల మధ్యలో నిర్మించిన వంతెన కొట్టుకుపోయింది. ఈ వంతెన కొట్టుకుపోవడంతో అటు వైపు, ఇటువైపు దాదాపు 10 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయి. కొట్టుకుపోయిన వంతెనను రెవెన్యూ, పోలీసు అధికారులు పరిశీలించారు. నివేదికను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు వారు తెలియజేశారు.

కాలువలో పడి వ్యక్తి మృతి

ధర్మవరం రూరల్: ధర్మవరం పట్టణంలో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి స్థానిక శ్రీదేవి థియేటర్ వద్ద కాలువలో పడి బసవన్న కట్ట వీధికి చెందిన సుపారి నాగరాజు (60) అనే చేనేత కార్మికుడు మృతి చెందాడు. సోమవారం ఒకటో పట్టణ సిఐ నాగేంద్రప్రసాద్ తెలిపిన వివరాలకు వెళితే సుఫారి నాగరాజు పట్టుచీరలు మగ్గం వేస్తూ జీవనాన్ని కొనసాగించేవాడు. తరచూ మద్యాన్ని సేవిస్తూ ఉన్న క్రమంలో ఆదివారం రాత్రి కూడా మద్యం సేవించి డ్రైనేజీ పక్కన పడిపోయాడు. గత రాత్రి భారీ వర్షం రావడంతో ఎగువ ప్రాంతం నుంచి వచ్చిన నీరు అధికం కావడంతో డ్రైనేజీలో పడి మృతిచెందాడు. సోమవారం ఉదయం పారిశుధ్య కార్మికులు డ్రైనేజీలను శుభ్రం చేస్తుండగా నాగరాజు మృతదేహం బయటపడింది. భారీ వర్షాలకు కూలిన ఇళ్లను రెవెన్యూ అధికారులు సోమవారం పరిశీలించారు.

నిండిన గాజులపల్లి చెరువు

పుట్టపర్తి రూరల్ : నాలుగు రోజులనుండి సత్యసాయి జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పుట్టపర్తి మండల పరిధిలోని గాజులపల్లి చెరువు నిండిమరువ పారుతుంది. ఈ చెరువు నుండి మరువ నీరు వంగ పేరు నది ద్వారా క్రింది ప్రాంతమైన నిడిమామిడి, కొట్లపల్లి, ఇరగరాజు పల్లి మీదుగా చిత్రావతి నదిలోకి కలుస్తుంది. ఆదివారం రాత్రి ఎగువ ప్రాంతాలైన పెనుకొండ, సోమందేపల్లి మండలాల్లో కురిసిన భారీ వర్షాలకు ఈ చెరువు లోకి నీళు చేరి మరువు పారుతున్నట్టు రైతులు తెలిపారు.మండల వ్యాప్తంగా ఆదివారం రాత్రి నుండి సోమవారం ఉదయం వరకు వర్షాలు కురిసాయి. దాంతో మండలంలోని బత్తలపల్లి ,గువ్వలగుట్టపల్లి, వెంగళమ్మ చెరువు, యనమలపల్లి, బుక్కపట్నం చెరువులకు వంకల ద్వారా చెరువుల్లోకి నీరు చేరుతోంది.

మరువ పారుతున్న పుట్టపర్తిలోని గాజులపల్లి చెరువు

రొద్దం మండలంలో మొక్కజొన్న పంటలోకి చేరిన వర్షపునీరు



ధర్మవరంలో కూలిన ఇల్లు

నీటి మునిగిన మొక్కజొన్న పంట

రొద్దం : మండలంలోని పలు గ్రామాల్లో మొక్కజొన్న, పంటలు నీట మునిగాయి. ఇందులో భాగంగా రొద్దకంపల్లి పొలంలో రైతు రామాంజికి చెందిన మొక్కజొన్న పంటలో నీరు చేరింది. దీంతో చేతికి వచ్చిన పంట నోటికి అందకుండా పోయిందని రైతు వాపోయాడు. గతంలో వర్షపు నీరు ముందుకు వెళ్లడానికి కాలువలు ఉండేవని ఇప్పుడు ఆ కాలువలు కొంతమంది పూడ్చి వేసి పంట పొలాలుగా చేసుకొన్నారనిదీంతో పైనుంచి వచ్చిన నీరు ముందుకు వెళ్లలేక తగ్గుగా ఉన్న పొలాల్లోకి వెళుతున్నాయని అన్నారు.

అప్రమత్తంగా ఉండండి : ఆర్డీవో

ధర్మవరం రూరల్ : ధర్మవరం డివిజన్ లో గత నాలుగు రోజులు నుండి కురుస్తున్న భారీవర్షాలకు తోడు ఇంకా నాలుగు రోజులు వర్షాలుకురిసే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆర్డీవో మహేష్ తెలిపారు. ఈ నెల 15వ తేదీ వరకు జిల్లాలోఉరుములు, పిడుగులతో కూడిన వర్షాలు పడే సూచనలు ఉన్నాయని ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

బి టి ప్రాజెక్ట్ నీటిమట్టం1649.6 అడుగులు

రాయదుర్గం: అనంతపురం జిల్లాలోని భైరవాని తిప్ప ప్రాజెక్టు రిజర్వాయర్ నీటిమట్టం సోమవారం నాటికి 1649.6 అడుగులు ఉన్నట్లు నీటిపారుదల శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హరీష్ తెలిపారు. రిజర్వాయర్ గరిష్ట నీటిమట్టం 1655 అడుగులు కాగా ప్రస్తుతం రిజర్వాయర్ లోకి 3125 క్యూసెక్కుల నీటి ప్రవాహం వస్తున్నట్లు తెలిపారు. రిజర్వాయర్లో1251 ఎంసిఎఫ్‌టి నీరు నిల్వ ఉన్నట్లు తెలిపారు.

వర్షానికి కూలిన ఇంటి గోడ

పుట్లూరు : వర్షానికి మండల పరిధిలోని గాండ్లపాడు గ్రామానికి చెందిన పుల్లారెడ్డి ఇంటి గోడ ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి కూలిపోయింది. దీంతో బాధితుడు పుల్లారెడ్డి సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ శేషారెడ్డికి వినతిపత్రం అందజేసి ఇల్లు మంజూరు చేయాలని కోరారు.

రాహుల్‌గాంధీ అరెస్ట్ దుర్మార్గం : కాంగ్రెస్

ప్రజాశక్తి-గోరంట్ల

కాంగ్రెస్‌పార్టీ అగ్రనేత, ఎంపి రాహుల్‌గాంధీని అరెస్టు చేయడం దుర్మార్గమైన చర్య అని ఆ పార్టీ పెనుకొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి నరసింహులు పేర్కొన్నారు. పట్టణంలో సోమవారం ఆయన మాట్లాడుతూ గత పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి అక్రమ మార్గాల ద్వారా గద్దెనెక్కిందని ఆరోపించారు. భారత ఎన్నికల కమిషన్ బిజెపి ఎన్నికల కమిషన్‌గా మారి ఆ పార్టీని గెలిపించిందన్నారు. దేశవ్యాప్తంగా ఎలక్షన్ కమిషన్ చేసిన అవకతవకలను స్పష్టమైన ఆధారాలతో సేకరించి రాహుల్‌గాంధీ దేశ ప్రజల ముందు ఉంచారన్నారు. ఈ విషయమై ఇండియా కూటమి నేతలు, పార్లమెంట్ సభ్యులు సాక్ష్యాధారాలను ఢిల్లీలో భారత ఎన్నికల సంఘానికి సమర్పించడానికి వెళ్తుంటే పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేయడం సిగ్గుచేటు అన్నారు. ఈ అరెస్టును పౌరులు, మేధావులు, ప్రజాస్వామ్యవాదులు ఖండించాలని కోరారు. మోడీ ప్రధాని అయిన తర్వాత బిజెపికి మద్దతు ఇస్తున్న పార్టీలే రాష్ట్రాల్లో కూడా గెలిసేలా కుట్రలు చేశారన్నారు. తనపై ఉన్న కేసుల భయంతో ఈ విషయంపై జగన్ కూడా స్పందించడం లేదన్నారు. సుప్రీంకోర్టు జోక్యం చేసుకొని ఎలక్షన్ కమిషన్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, కేంద్ర ప్రభుత్వంతో పాటు రాజస్థాన్, ఎపి, గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వాలను రద్దు చేసి బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు జరపాలని డిమాండ్ చేశారు.

సంఘీభావంతో ఐక్యత చాటుతున్న ఈయు నాయకులు

ఆర్టీసీ స్థలాన్ని 'లూలూ'కు కట్టబెడితే సహించం

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

విజయవాడ నగరంలోని ఎపిఎస్ ఆర్టీసీ బస్టాండు స్థలాన్ని ప్రభుత్వం లూలూ షాపింగ్ మాల్‌కు కట్టబెట్టేలా జారీ చేసిన జీవోను వెంటనే రద్దు చేయాలని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నబిరసూల్, కార్యదర్శి నాగార్జునరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక సాయి ఆరామంలో సోమవారం ఆ యూనియన్ జిల్లా అధ్యక్షుడు జివిపి.రావు అధ్యక్షతన జిల్లా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ విజయవాడలోని ఆర్టీసీ డిపో, బస్టాండుకు చెందిన సుమారు రూ. 400 కోట్ల విలువ చేసే భూమిని లూలూ కంపెనీకి కట్టబడితే సహించబోమని హెచ్చరించారు. వెంటనే ఆ జీవోను రద్దు చేయకపోతే అన్ని యూనియన్లను కలుపుకొని ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు, నాయకులు రమణప్ప, శంకరప్ప, ఆదినారాయణ, రుక్మిణి, ఆరెన్న, హనుమానాయక్, తదితరులు పాల్గొన్నారు.

మరో నాలుగు రోజులు భారీ వర్షాలు : ఆర్‌డిఓ

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

ధర్మవరం డివిజన్‌లో నాలుగు రోజుల నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయని, మరో నాలుగు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆర్‌డిఓ మహేష్ సోమవారం ఓ ప్రకటలో తెలిపారు. ఈ నెల 15వ తేదీ వరకూ జిల్లాలో భారీ ఉరుములు, పిడుగులతో కూడిన వర్షాలు పడే సూచనలు ఉన్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పట్టణంలోని ఆర్‌డిఓ కార్యాలయంతో పాటు డివిజన్‌లోని అన్ని తహశీల్దార్ కార్యాలయాల్లో కమాండ్ కంట్రోల్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అత్యవసర పరిస్థితుల్లో సహాయం కోసం సంబంధిత తహశీల్దార్ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సంప్రదించాలన్నారు. ఆర్‌డిఓ కార్యాలయ కంట్రోల్ రూం : 98660 57959, ధర్మవరం తహశీల్దార్-95539 29724, బత్తలపల్లి-79897 22695, తాడిమర్రి-93911 64803, ముదిగుబ్బ-63012 79595, చెన్నేకొత్తపల్లి-79817 34346, కనగానపల్లి-85558 28121, రామగిరి-88972 31796 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

విద్యుత్ స్తంభాలు మార్చాలని వినతి

ప్రజాశక్తి-పెనుకొండ

నగర పంచాయతీ పరిధిలో శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాలను తక్షణమే మార్చాలని టిడిపి నాయకులు విద్యుత్ శాఖ ఏఈకి వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ 1వ వార్డు ఇస్లాపురంలో 10, పట్టణంలోని వివిధ వార్డుల్లో వంద ఇనుప విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. ఇటీవల భారీ వర్షాలు కురుస్తుండటం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, వాటి స్థానంలో వెంటనే సీసీ స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే కొండాపురం బిసి కాలనీలో వాటర్ సప్లై బోర్ వెల్‌కు 3ఫేస్ విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ శ్రీరాములు, కౌన్సిలర్ హనుమంతు, నాయకులు ఈశ్వరయ్య, వేణు, శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం, నంజుండ, సాయి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుడు గుండెపోటుతో మృతి

ధర్మవరం రూరల్ : పట్టణంలో సోమవారం చేనేత కార్మికుడు ఉక్కిశిల నాగరాజు(58) గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలిసిన వెంటనే చేనేత కార్మిక సంఘం నాయకులు వారి ఇంటికి వెళ్లి మృత దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి చేనేత కులాల ఐక్యవేదిక తరపున రూ. 10వేలు, బీరే కేశవ అండ్ బ్రదర్స్ తరపున రూ. 10వేలు అందజేశారు. కార్యక్రమంలో చేనేత కులాల ఐక్యవేదిక కమిటీ సభ్యులు పరిసే సుధాకర్, బీరే కేశవ, గిర్రాజు శశి, పల్లా నవీన్, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల కార్డెన్ సెర్చ్

ధర్మవరం రూరల్ : రూరల్ మండలంలోని సుబ్బారావు పేట గ్రామంలో సోమవారం రూరల్ సిఐ ప్రభాకర్, ఎస్ఐ శ్రీనివాసులు, బత్తలపల్లి ఎస్ఐ సోమశేఖర్, సిబ్బంది కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలో మద్యం అమ్మకాలపై తనిఖీలు చేపట్టారు. అలాగే ప్రజలతో గ్రామ సభ ఏర్పాటు చేశారు. సిఐ మాట్లాడుతూ ప్రజలు గొడవలకు దూరంగా ఉండాలని, అందరూ కలిసిమెలిసి ప్రశాంతంగా జీవించాలన్నారు. ఏదైనా సమస్య ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, మహిళల పట్ల గౌరవంగా ప్రవర్తించాలని, పేకాటకు దూరంగా ఉండాలని, మద్యానికి బానిస కాకూడదని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

హంద్రీనీవా పనులు పూర్తిచేయాలని వినతి

నంబులపూలకుంట : మండల పరిధిలోని హంద్రీనీవా సుజల స్రవంతి కాలువ 17, 18 ఫేజ్ పనులను త్వరగా పూర్తి చేసి గ్రామాలకు సాగు, తాగు నీరందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సిపిఎం మండల నాయ కులు గంగిరెడ్డి సోమవారం తహశీల్దార్ దేవేంద్రనాయక్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఆయన మాట్లా డుతూ హంద్రీనీవా కాలువ మరమ్మతులు చేపట్టడంలో జాప్యం జరిగిందన్నారు. దీంతో నీటి ప్రవాహం లేక కాలువలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయని తెలిపారు. కాలువల్లో ముళ్లపొదలు పేరుకు పోయాయని, ఉన్నతాధికారులు దృష్టి సారించి కాలువ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు నాగరాజు, ఈశ్వరరెడ్డి, గుర్రప్ప, బాలాజీ, దర్బార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన సింగిల్‌విండో అధ్యక్షులు

నల్లచెరువు : నల్లచెరువు సింగిల్‌విండో అధ్యక్షులుగా తలమర్లవాండ్లపల్లికి చెందిన కుండ వెంకటరమణ సోమ వారం బాధ్యతలు చేపట్టారు. వెంకటరమణ గతంలో సర్పంచిగా ఐదేళ్లు పని చేశారు. ఇప్పుడు సింగిల్ విండో అధ్యక్షునిగా ఎన్నికైనందున ఆ గ్రామానికి చెందిన పలువురు ఆయన ఘనంగా సన్మానించారు. ఆయనతో పాటు డైరెక్టర్లు రాగన్నగారిపల్లికి చెందిన అలుగుంటి గంగులప్ప, అంజనప్ప, తదితరులు బాధ్యతలు స్వీకరించారు. మండలంలోని ఎస్.మొలకలపల్లి సొసైటీ అధ్యక్షునిగా దాబా గంగయ్య, డైరెక్టర్లుగా తిరుపాల్‌నాయక్, బాలేపల్లితండా రాట్నాలపల్లికి చెందిన శివన్న కూడా బాధ్యతలు స్వీకరించారు.



నల్లచెరువు సింగిల్‌విండో అధ్యక్షులు, డైరెక్టర్లను సన్మానించిన నాయకులు

అర్హులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలి

ప్రజాశక్తి-గోరంట్ల

మండలంలోని పాలసముద్రం వద్ద ప్రభుత్వ స్థలంలో షెడ్లు వేసుకుని నివాసం ఉం టున్న నిరుపేదలకు తక్షణమే ఇళ్ల పట్టాలు మంజూ రు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఫిరంగి ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం వ్యకాసం ఆధ్వర్యం లో తహశీల్దార్ మారుతికి వినతి పత్రం ఇచ్చారు. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ పేదలు ఇళ్ల స్థలాల హక్కుల కోసం రెండేళ్లుగా పోరాడుతు న్నారని, హైకోర్టు సైతం ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. అయితే మండల రెవెన్యూ అధికారులు కనీస చర్యలు తీసుకోకపోగా స్థానిక విఆర్ఓ రమేష్ పేదలపై దౌర్జన్యా నికి దిగుతూ భయభ్రాంతులకు గురి చేస్తు న్నారని, అతడిపై చర్యలు తీసుకోవాలని కోరారు. తహశీల్దార్ మాట్లాడుతూ ఇళ్ల దరఖాస్తులపై విచారణ చేసి అర్హులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్ర మంలో వ్యకాసం జిల్లా కమిటీ సభ్యులు పెద్దన్న, స్వర్ణలత, భవన నిర్మాణ కార్మిక సంఘం నియోజకవర్గ కన్వీనర్ కొండా వెంకటేశు లు, ఇళ్ల స్థలాల సాధన పోరాట కమిటీ నాయకులు అంజనాదేవి, మీసాల ఆంజనేయులు, భాస్కర్, అచ్చమ్మ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

పెనుకొండలో తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు, పేదలు

పెనుకొండ : అర్హులైన పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని సిపిఎం నాయకులు ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సిపిఎం ఆధ్వర్యంలో తహశీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. సిపిఎం నాయకులు హరి, బాబావలి మాట్లాడుతూ పేదలు 15 ఏళ్లుగా అద్దె ఇళ్లలో నివాసం ఉంటున్నారన్నారు. కియా పరిశ్రమ రాకతో ఈ ప్రాంతంలో ఇళ్ల అద్దెలు విపరీతంగా పెరిగాయని, దీంతో పేదలు అద్దె కట్టలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు నాగరాజు, నరసింహ, హబీబ్, పేదలు బేబీలత, అనిత, ఫక్రున్నీసా, వెంకటలక్ష్మి, బషీరుణ్, సలీమ, షబానా, వేదవతి, తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : పట్టణంలోని పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వ ర్యంలో తహశీల్దార్ మురళీకృష్ణకు పేదలు అర్జీలు ఇచ్చారు. నాయకులు మాట్లాడుతూ సైదాపురం, కుమ్మరవాండ్లపల్లి గ్రామ పొలాల్లో పేదలు గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నారన్నారు. వారికి న్యాయం చేయాలని కోరారు. స్పందించిన తహశీల్దార్ ఈ నెల 30 తేదీ లోపు అర్జీలను పరిశీలించి అర్హులకు ఇళ్ల స్థలాలు ఇస్తామన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు జగన్మోహన్, సాంబశివ, రామ్మోహన్, బాబ్‌జాన్, నారాయణ, అంజి, పేదలు అమ్ములు, యాస్మిన్, అమ్మాజాన్, గాయత్రి, చందన, దివాకర్, నాగేశ్వర్, కాంతమ్మ, భారతి, సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

'సత్యసాయి' కార్మికులకు వేతనాలు ఇవ్వాలి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

సత్యసాయి తాగునీటి సరఫరా కార్మికులకు బకాయి వేతనాలు వెంటనే మంజూరు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి లక్ష్మినారా యణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో ఆ కార్మికులతో కలిసి కలెక్టర్ టిఎస్.చేతన్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ 541 మంది కార్మికులు సుమారు వెయ్యి గ్రామాలకు తాగునీరు అందిస్తున్నారన్నారు. 4 నెలలుగా వేతనాలు అందకపోతే కుటుంబాలను ఎలా పోషించుకుంటారని ప్రశ్నించారు. ఈ పథకం సక్రమంగా అమలయ్యేందుకు పూర్తి బడ్జెట్‌ను కేటాయించాలన్నారు. కార్యక్రమంలో కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షుడు నరేష్, సిఐటియు మండల కార్యదర్శి గంగాధర్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు బాబా, రఫీ, కార్మిక నాయకులు మధు, ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు. ఈ నెల 15వ తేదీ నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఆటో కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించాలని ఎపి ఆటో, ట్రాలీ డ్రైవర్ల యూనియన్ నాయకులు పెడపల్లి బాబా ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

కొత్తచెరువులో గడ్డి తిని నిరసన తెలుపుతున్న 'సత్యసాయి' కార్మికులు

గడ్డి తిని 'సత్యసాయి' కార్మికుల నిరసన

కొత్తచెరువు రూరల్ : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం సత్యసాయి తాగునీటి పథకం కార్మికులు మండలంలోని కేశాపురం పంపు హౌస్ వద్ద పచ్చి గడ్డి తిని వినూత్న రీతిలో నిరసన తెలిపారు. కార్మికుల సంఘం కోశాధికారి రాము మాట్లాడుతూ 4 నెలలుగా వేత నాలందక కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతు న్నారన్నారు. ఈ విషయంపై పలుమార్లు ఉన్నతాధికారులకు విన్నవించినా ఫలితం లేదన్నారు. విధి లేని పరిస్థితుల్లో సమ్మె చేస్తున్నార న్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకొని బకాయి వేతనాలు చెల్లించడంతో పాటు సమస్యలు పరిష్కరించాలని కోరారు.

వైసిపి 'రీకాల్ బాబు'కు స్పందన కరువు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కదిరి టౌన్

కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి ఓర్వలేని వైసిపి అధినేత జగన్ ఆదేశాల మేరకు ఆ పార్టీ చేపట్టిన 'రీకాల్ బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ'ని ప్రజలు విశ్వసించడం లేదని, ఆ కార్యక్రమానికి ప్రజల నుంచి స్పందన కరువైందని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం అమలు చేస్తున్నట్లు తెలిపారు. రైతులు పండించే కూరగాయలు, ఇతర వాటిని గ్రామాల నుంచి తరలించేందుకు సరుకు రవాణాకి సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. వైసిపికి, జగన్‌కు ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పినా వారిలో మార్పు రాలేదన్నారు. అన్నదాత సుఖీభవ పథకం అమలుపై ఈ నెల 14వ తేదీ రైతులతో ట్రాక్టర్ ర్యాలీ చేపడుతామని, జయప్రదం చేయాలని కోరా రు. కార్యక్రమంలో నాయకులు పివి.పవన్‌కుమార్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్, మండల కన్వీనర్లు, పర్వీన్‌బాను, నాగప్ప పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట ప్రసాద్

ఆర్‌డిటి ఎఫ్‌సిఆర్‌ఎను రెన్యువల్ చేయాలి

రొద్దం తహశీల్దార్‌కు వినతి ఇస్తున్న ప్రజలు

ప్రజాశక్తి-పెనుకొండ

కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆర్‌డిటికి ఎఫ్‌సిఆర్‌ఎను పునరుద్ధరించాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవా రం మానవ హక్కుల పరిరక్షణ మండలి అధ్యక్షులు ఎంఎన్.మూర్తి ఆధ్వర్యంలో జిల్లా మానవ హక్కుల పరిరక్షణ మండలి, దళిత సంఘాలు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, ట్రేడ్ యూనియన్ నాయకులు పట్టణంలోని అంబేద్కర్ కూడలి వద్ద రాస్తారోకో చేపట్టారు. అనంతరం ర్యాలీగా వెళ్లి ఆర్డీఓ ఆనంద్ కుమార్‌కు వినతిపత్రం ఇచ్చి ప్రధానమంత్రికి పంపాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు ఎం.పెద్దన్న, టి.రామాంజనేయులు, నరసింహులు, అనిల్, లక్ష్మీనారాయణ, చెరుకూరి గంగులయ్య, మల్లికార్జున, ఓబులేసు, మహమ్మద్ హుస్సేన్, సాకే హరి, తదితరులు పాల్గొన్నారు.

రొద్దం : ఆర్‌డిటి విదేశీ నిధులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఎఫ్‌సిఆర్‌ఎను పునరుద్ధరించాలని మండలంలోని పలు గ్రామాల ప్రజలు డిమాండ్ చేశారు. ఈ విషయమై స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి తహ శీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించి అక్కడ ఆర్‌డిటికి మద్దతుగా నినా దాలు చేశారు. అనంతం తహశీల్దార్ ఉదయ్‌శంకర్‌రాజ్‌కు వినతిపత్రం ఇచ్చారు. ర్యాలీలో గోపాల్, లింగప్ప, జయప్ప, దుర్గప్ప, నరేష్, మహిళలు పాల్గొన్నారు



మాట్లాడుతున్న ఎపిరైతు సంఘం నాయకులు

రైతు వ్యతిరేక విధానాలపై రేపు బైక్‌ర్యాలీ

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 13వ తేదీ ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో పుట్టపర్తిలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా నాయకులు జంగాలపల్లి పెద్దన్న, ఆలకుంట మారుతి తెలిపారు. పట్టణంలో సోమవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల రద్దు, స్వామినాథ్ సిఫారసుల అమలు, పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, పరిశ్రమల పేరుతో మడకశిర, పరిగి, లేపాక్షి, కదిరి ప్రాంతాల్లో సేకరించిన భూములను తిరిగి రైతులకు ఇవ్వాలన్నారు. ఆయా అంశాలపై చేపట్టనున్న బైక్ ర్యాలీలో రైతులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీనియర్ నాయ కులు ఎస్‌హెచ్.బాషా, జెవి.రమణ, వెంకటస్వామి, ఎస్ఎఫ్ఐ నాయకులు నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి-కొత్తచెరువు

కొత్తచెరువులో నాలుగు రోడ్లకు ఇరువైపులా ఉన్న ఆక్రమణల తొలగింపు ప్రక్రియను సోమవారం ఆర్‌అండ్‌బి ఎస్ఈ సంజీవయ్య పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 15 రోజులుగా ఆక్రమణల తొలగింపు పనులు సాగుతున్నాయని, మరింత వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని స్థానిక అధికారులను ఆదేశించారు. కొందరు వ్యక్తులు ఆక్రమణలను తొలగించుకోకుండా స్టే తీసుకొచ్చారని వారి గడువు ముగిసిన వెంటనే తొలగిస్తామన్నారు. రోడ్లపై ఉన్న విగ్రహాలను కూడా కలెక్టర్ ఆదేశాల మేరకు వేరే ప్రాంతానికి తరలించడానికి స్థలాన్ని పరిశీలిస్తున్నామన్నారు. ఫోర్ లైన్ రోడ్డు వేయడానికి ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, ఆక్రమణల తొలగింపు పూర్తయి, నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు. ఆయన వెంట ఆర్‌అండ్‌బి ఏఈ వన్నూరుస్వామి, మేజర్ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

ప్రభుత్వ భూములను పరిరక్షిస్తాం : తహశీల్దార్

ప్రజాశక్తి-నంబులపూలకుంట

మండల వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ భూములను అన్యాక్రాంతం కాకుండా పరిరక్షిస్తామని తహశీల్దార్ దేవేంద్రనాయక్ స్పష్టం చేశారు. మండలంలోని వంకమద్ది క్రాస్ వద్ద గల ప్రభుత్వ భూమిని సోమవారం ఆయన సర్వేయర్లతో కలిసి సర్వే చేయించారు. ప్రభుత్వ భూములను కొందరు వ్యక్తులు కబ్జా చేస్తున్నట్లు దిన పత్రికల్లో కథనాలు రావడంతో మండలంలో ఉన్న ప్రభుత్వ భూములను సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఎవరైనా ప్రభుత్వ భూముల జోలికి వస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట సర్వేయర్లు ఉపేంద్ర, షెక్షావలి, నాగేంద్ర నాయక్, వర్ధన్, హర్షవర్ధన్, బాబు ఉన్నారు.

వైసిపి ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ'

మడకశిర : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం తుంగలో తొక్కి ప్రజలను మోసం చేస్తుందని వైసిపి నాయకులు మండిపడ్డారు. వైసిపి ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ' కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా పట్టణ కమిటీల ఇన్‌ఛార్జి భారతిరెడ్డి, జయరాజు ఇంటింటికీ వెళ్లి వైసిపి రూపొందించిన క్యూఆర్ కోడ్ కరపత్రాలు పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలతో పాటు ఎన్నికల హామీలను విస్మరించిందన్నారు. కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ సతీష్ కుమార్, కౌన్సిలర్లు అన్వర్, శ్రీనివాసులు, అంజన్ కుమార్, కోఆప్షన్ మెంబర్స్ ఫక్రుద్దీన్, సైఫుల్లాఖాన్, టౌన్ ఉపాధ్యక్షులు గోపి, సుధీర్‌రెడ్డి, ఓంకుమార్, అంజలి, వెంకటేష్, బేకరీ నాగరాజు, గోపాలప్ప, రఘు, నగేష్, ధను, సనావుల్లా, చంద్ర, నవీన్‌కుమార్, చంద్రశేఖర్, మంజు పాల్గొన్నారు.

విఆర్ఎ మృతికి నివాళి

గాండ్లపెంట : మండలంలోని సోమయాజులపల్లికి చెందిన విఆర్ఎ పెండ్లూరి ఓబన్న(80) అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలిసిన వెంటనే తహశీల్దార్ బి.బాబురావు ఆ గ్రామం వెళ్లి ఓబన్న మృతదేహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఆయన కుటుంబాన్ని పరామర్శించిన భార్య రామక్కకు రూ. 25 వేలు, అంత్యక్రియలకు రూ. 25 వేలు అందజేశారు. ఓబన్నకు భార్య, ఐదుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. నివాళులర్పించిన వారిలో ఆర్ఐ జాఫర్, వీఆర్వోలు అమానుల్లా, వెంకటరమణ, రాజేందర్ ఉన్నారు.

గర్భిణులకు భోజనం ఏర్పాటు

తలుపుల : వైద్యం కోసం స్థానిక పిహెచ్‌సికి వచ్చిన గర్భిణులతో పాటు ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది మొత్తం 150 మందికి సోమవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ అశోక్‌కుమార్ సహకారంతో రూరల్ డెవలప్మెంట్ ఫ్రెండ్స్ ట్రస్ట్ ద్వారా ఉచిత భోజనం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఇఒ వెంకటరాయుడు, వైద్యాధికారి ఆశ్రిత గర్భిణులకు భోజనం వడ్డించారు. ట్రస్ట్ సభ్యుడు మన్సూర్ మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల నుంచి వైద్య పరీక్షల కోసం ఆసుపత్రికి వచ్చే గర్భిణులకు దాతల సహకారంతో ప్రతి నెలా పౌష్టికాహారం అందిస్తున్నామని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్, సిబ్బంది, విద్యార్థులకు ధన్యవాదాలు తెలిపారు.

గర్భిణులకు భోజనం వడ్డిస్తున్న ట్రస్ట్ సభ్యులు

శ్మశానవాటికకు దారి కల్పించాలని నిరసన

చిలమత్తూరు : శ్మశానవాటికకు దారి కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం మండలంలోని దేమకేతేపల్లి పంచాయతీ కొర్లకుంట ఎస్సీ కాలనీవాసులు సిపిఎం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ ఈ సమస్యపై అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. స్పందించిన తహశీల్దార్ వారంలో పరిష్కారం చూపుతామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. అనంతరం తహశీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వెంకటేష్, ఎస్సీ కాలనీ వాసులు నరేంద్ర, వేణుగోపాల్, రామంజి, గంగాధర్, గంగప్ప, తిమ్మన్న, నరసింహప్ప, లక్ష్మీపతి, పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పోక్సో కేసులో నిందితుడికి యావజ్జీవం

ప్రజాశక్తి-హిందూపురం

ఎనిమిదేళ్ల చిన్నారిపై అత్యాచారం చేసి హత్య చేసిన కేసులో నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ అనంతపురం పోక్సోకోర్టు న్యాయమూర్తి చిన్నబాబు సోమవారం తీర్పు వెల్లడించారు. ఇందుకు సంబంధించి హిందూపురం అప్ గ్రేడ్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కర్నాటక రాష్ట్రం గౌరీబిదనూరు తాలూకా నామగుండ్లు గ్రామానికి చెందిన మంజులకు ఇద్దరు కుమార్తెలు కాగా జీవనోపాధి కోసం హిందూపురం మండలం తూముకుంటలో ఉన్న తన సొంత అక్క రత్నమ్మ ఇంటికి వచ్చింది. రత్నమ్మ భర్త గంగాధర ఇంతకు మునుపే రెండు కేసులలో జైలుకు పోయి వచ్చాడు. గంగాధర్ ప్రతి రోజూ మంజుల కుమార్తె ను పొలం దగ్గరికి పోయి వస్తాము రా, నీకు ఏమైనా బయట తినడానికి కొనిస్తాను అని పిలిచేవాడు. ఇతనిని చూసి మంజుల, ఆమె 8 ఏళ్ల కూతురు భయపడేవారు. గత ఏడాది ఆగస్టు 2న గంగాధర్ ఆ చిన్నారిని పొలం వద్దకు వెళదామని పిలుచుకుపోయి బలాత్కారం చేశాడు. అనంతరం హత్యకేసి సమీపంలోని పెన్నా నదిలో పూడ్చి పెట్టాడు. గంగాధర్ ఒక్కడే ఇంటికి రావడంతో బాధితురాలు తల్లి మంజులతో తోపాటు స్థానికులు, బంధువులు చిన్నారి గురించి ప్రశ్నించారు. తాను ఎప్పుడు పిలిచినా ఆ పాప రాకపోవడంతో గొంతు నులిమి చంపి పెన్నా నది లో పూడ్చినట్లు అంగీకరించాడు. దీంతో బాలిక తల్లి హిందూపురం రూరల్ అప్ గ్రేడ్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని నిందితుడి అరెస్టు చేశారు. సంబంధిత కేసు అనంతపురం పోక్సో న్యాయస్థానంలో విచారణకు రాగా న్యాయమూర్తి 17 మంది సాక్షులను విచారించారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి యావజ్జీవ కారాగారా శిక్ష, రూ.10 వేల జరిమానా, మృతదేహాన్ని పూడ్చిపెట్టి సాక్షాన్ని తారుమారు చేసినందుకుగాను ఐదేళ్ల జైలుశిక్ష, వెయ్యిరూపాయల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ఈ కేసును ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీలు ఈశ్వరమ్మ, సుజన, లక్ష్మీనారాయణ వాదించారు. నిందితుడికి శిక్ష పడటంలో నైపుణ్యత కనబరిచిన ఏఎస్ఐ శ్రీనివాసులు,కోర్ట్ హెడ్ కానిస్టేబుల్ మల్లికార్జున, కానిస్టేబుల్ పవన్ కుమార్‌ను పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో కర్నాటక వాసి మృతి

చిలమత్తూరు : మండలంలోని 44వ నెంబరు జాతీయ రహదారి కొడికొండ చెక్‌పోస్ట్‌లో ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో శేఖర్(26) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. కర్నాటకలోని నగరిగెరకు చెందిన శేఖర్ ద్విచక్ర వాహనంపై వెళ్తూ చెక్‌పోస్టులో గంగోత్రి హోటల్ వైపు నుంచి రోడ్డు దాటుతుండగా బెంగళూరు వైపు నుంచి వచ్చిన ఓ ప్రయివేటు ట్రావెల్స్ బస్సు వెనుకవైపు నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో శేఖర్ అక్కడికక్కడే మృతి చెందగా అతడితో పాటు ప్రయాణిస్తున్న మరో వ్యక్తి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మద్యం ధ్వంసం

బత్తలపల్లి : బత్తలపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో పట్టుబడ్డ మద్యాన్ని సోమవారం ధ్వంసం చేసినట్లు ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ మొత్తం 18 కేసుల్లో పట్టుబడ్డ ఎపికి చెందిన 163 బాటిళ్లు, కర్నాటకకు చెందిన 63 బాటిళ్లను జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ జిల్లా అధికారి గోవింద్‌నాయక్, బత్తలపల్లి వీఆర్వోలు ప్రతాప్, చెన్నకేశవప్రసాద్ ఆధ్వర్యంలో బత్తలపల్లి గ్రామ చెరువు వద్ద ధ్వంసం చేశామన్నారు. కార్యక్రమంలో ఎఎస్ఐ విజయ్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్ గంగాధర్, కానిస్టేబుల్ జనార్ధన్, విఆర్ఎ రాజా, రెవెన్యూ, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న మంజునాథ్

'పార్టీ కోసం పని చేసిన వారికే పదవులు'

ప్రజాశక్తి-పరిగి

మండలంలో టిడిపి కోసం పని చేసిన వారికే పదవులు దక్కుతాయని పెనుకొండ నియోజకవర్గ పరిశీలకులు మంజునాథ్ తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం మండల, గ్రామ కమిటీ కన్వీనర్లు, ముఖ్య నాయకులతో మండల కన్వీనర్ గోవిందరెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మంజునాథ్ మాట్లాడుతూ మండలంలో వర్గాలకు తావు లేదన్నారు. పార్టీ కోసం పని చేసిన ప్రతి కార్యకర్త, నాయకులను గుర్తించి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. అనంతరం ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ కమిటీలతో పాటు పలు విభాగాలకు సంబంధించిన కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు సూర్యనారాయణ, సర్పంచి బాలాజీ, వెంకటేష్, సంజీవరాయప్ప, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల తనిఖీ

తాడిమర్రి : స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ హరిత, ఎన్‌డిడి స్టేట్ నోడల్ ఆఫీసర్ కె.గంగాధర్ సోమవారం స్థానిక కెజిబివి, అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. అల్బెండజోల్ ప్రోగ్రామ్ గురించి వివరాలు తెలుసుకున్నారు. మంగళవారం అన్ని స్కూల్స్, అంగన్వాడీ కేంద్రాల్లో ఈ మాత్రలు వేసి పిహెచ్‌సికి నివేదిక ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ చెన్నారెడ్డి, డాక్టర్ హరిత, సిబ్బంది రామ్‌కుమార్, జానకిరామ్, కోమల, ఆశా కార్యకర్త దానమ్మ, కెజిబివి ప్రిన్సిల్ పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు

అమడగూరు: మండలంలోని తుమ్మల పంచాయతీ మలకవారిపల్లి గ్రామంలో సోమవారం వెలుగు సంఘం సభ్యులకు ఆర్థిక అక్షరాస్యత, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, సుకన్య సమృద్ధి పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విడ్స్ సంస్థ సిఎఫ్ఎల్ వేమనారాయణ సంఘం సభ్యులకు ఆయా పథకాల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో క్లస్టర్ కోఆర్డినేటర్ రామాంజనప్ప, సెంటర్ ఫర్ ఫైనాన్షియల్ లిటరసీ వేమనారాయణ, యానిమేటరర్లు లక్ష్మినరసమ్మ, కృష్ణారెడ్డి, ప్రకాష్, రవి, సంఘం సభ్యురాళ్లు పాల్గొన్నారు.

ప్రధాన రహదారిపై బండరాళ్లు తొలగింపు

తాడిమర్రి : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని దాడితోట -పులివెందుల ప్రధాన రహదారిలో పుల్లట్ల కనుములో ఆదివారం కొండ చరి యలు విరిగిపడి పెద్ద బండ రాళ్లు రోడ్డుకు అడ్డంగా పడిన విషయం తెలిసిందే. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉండడంతో స్పందించిన ఎస్ఐ కృష్ణవేణి జెసిబిని తెప్పించి ప్రధాన రహదారిపై నుంచి బండరాళ్లను తొలగించారు. కార్యక్రమంలో జమేదారు కోటి శ్రీనివాసులు, కానిస్టేబుల్ ప్రకాష్ పాల్గొన్నారు.

ఎస్పీ గ్రీవెన్స్‌లో ఫిర్యాదుల వెల్లువ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పట్టణంలోని ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 55 ఫిర్యాదులు అందాయి. మా భూమి విషయంలో ఒక కండక్టర్, తహశీల్దార్ కలిసి నాతో పాటు కుటుంబ సభ్యులను ఇబ్బంది పెడుతున్నారని గోరంట్ల మండలం మందలపల్లి గ్రామానికి చెందిన వృద్ధురాలు మంగమ్మ ఫిర్యాదు చేసింది. కొత్తచెరువులో మండీ నిర్వహిస్తున్న కర్నాటకకు చెందిన శ్రీనివాసులు అడ్వాన్స్ రూ. 50వేలు ఇచ్చి 8 బొలెరోల మామాడి కాయలు తీసుకెళ్లి మిగిలిన సొమ్ము ఇవ్వకుండా వేధిస్తున్నాడని నల్లమాడ మండలం పేమలకుంటపల్లి కేశప్ప అర్జీ ఇచ్చాడు. కార్యక్రమంలో మహిళా పిఎస్ డీఎస్పీ ఆదినారాయణ, లీగల్ అడ్వైజర్ సాయినాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు స్వీకరిస్తున్న మహిళా పిఎస్ డీఎస్పీ ఆదినారాయణ